క్లుప్తంగా

ఆర్థిక సహాయం

మర్పల్లి: మండల పరిధి కొత్లాపూర్ గ్రామానికి చెందిన వెంకటమ్మ (42), బాగయ్య (76) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్ కొండల్‌రెడ్డి బాధిత కుటుంబీకులకు రూ.10వేలను ఆర్థిక సహాయంగా పంపగా.. ట్రస్ట్ సభ్యులు ప్రవీణ్‌రెడ్డి, పంచలింగాల సర్పంచ్ సురేందర్‌రెడ్డిలు ఇరు కుటుంబాలకు అందజేశారు.

ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పరిగి: ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రాములు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పరిగి నియోజకవర్గం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉందని, లౌకిక, ప్రజాస్వామ్య, సామాజిక శక్తులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎవరూ నెరవేర్చడం లేదని ఆరోపించారు. మతోన్మాద పార్టీ బీజేపీని ప్రజలు బలపరచరాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, మహిపాల్, రామకృష్ణ, సుదర్శన్, హబీబ్, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: పనిచేస్తూ బిల్డింగ్‌పై నుంచి ఓ వ్యక్తి కింద పడి మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నూతనంగా నిర్మిస్తున్న వైష్ణవి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నవాబ్‌పేట్ మండలం ఎల్లకొండ గ్రామానికి చెందిన జాకిర్(33) ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం పని చేసేందుకు గోవా కట్టెలపైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జాకిర్‌కు భార్య ఫరిద్‌జబిలి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి

షాబాద్: వ్యాధుల నుంచి మూగజీవాలను రక్షించుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని లక్ష్మరావుగూడ, సోలిపేట్, మాచన్‌పల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు ఉచితంగా పారుడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జీవాలకు ఎటువంటి రోగాలు వచ్చినా వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. ఇందులో వైద్య సిబ్బంది, రైతులు న్నారు.

మురుగుకాలువలో పడిన వృద్ధురాలు

తాండూరు: ఇంటి ముందు నిర్మిస్తున్న మురుగు కాలువలో ఓ వృద్ధురాలు జారిపడి, రెండు రోజులుగా జీవన్మరణంతో కొట్టుమిట్టాడింది. ఈ సంఘటన తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం తాండూరులోని గీతా మందిర్ వద్ద ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. భారతమ్మ(75) అనే వృద్ధురాలు కొడుకుతో కలిసి నివసిస్తోంది. అయితే తల్లి ఇంట్లో కనిపించకపోవడంతో పట్టణ పరిసరాల్లో వెతికారు. ఆచూకి లభించలేదు. అనుమానం వచ్చి రోడ్డు ఉన్న మురుగు కాలువను పరిశీలించగా.. అందులో కనిపించింది. మున్సిపల్ కార్మికుల సహాయంతో ఆమెను కాలువలోంచి బయటకు తీశారు. అనంతరం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. రెండు రోజులుగా మురుగు కాలువలో పడిన వృద్ధురాలు ప్రాణాలతో బయట పడటం చర్చనీయాంశమైంది.

వ్యక్తి మృతదేహం లభ్యం

అనంతగిరి: వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేట సమీపంలోని ఓ బావిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమయింది. సీఐ శ్రీను తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. బావిలో మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు సమచారం ఇవ్వగా.. పోలీసులు శవాన్ని వెలికి తీశారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నూతన నియామకం

చేవెళ్ల: కాంగ్రెస్ గెలుపుకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్‌లు సీనియర్ నాయకులు బల్వంత్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం దామరగిద్ద గ్రామానికి చెందిన పోతురాజు నవీన్‌ను ఎస్సీసెల్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.

మా గోడు వినండి..

- కాలుష్య కోరల్లో చిక్కుకున్నాం..
- రోగాల బారిన పడుతున్నాం..
- కస్తూర్బా విద్యార్థినుల ఆందోళన
- అధికారులు పట్టించుకోవడం లేదు: అధ్యాపకుల ఆరోపణ


పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినుల ఆందోళన

పెద్దేముల్: కాలుష్యపు కోరల్లో విద్యార్థినులు కొట్టుమిట్టాడుతున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న పరిశ్రమల వలన వెలువడే వాయి కాలుష్యానికి చదువుకు ఆటంకం కలగడమే కాకుండా.. భోజనం చేయలేని దుస్థితి నెలకొందని, అనారోగ్యం పాలవుతున్నామని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, సంబంధిత అధికారులకు, పాలకులకు విన్నవించినా మా గోడు వినడం లేదని ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా..

పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో 6 నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో 356 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. పాఠశాలకు కిలో మీటరు దూరాన సుద్ద కర్మాగారాలతో పాటు, పత్తి మిల్లులు కొనసాగుతున్నాయి. వీటి నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా సుద్ద ఫ్యాక్టరీ నుంచి వస్తున్న కాలుష్యం వలన భోజనం చేయడం ఇబ్బందిగా ఉందని, రాత్రివేళలో నిద్ర పట్టడం లేదని విద్యార్థులు, అధ్యాపకులు వాపోతున్నారు. పరిస్థితిని నాటి కలెక్టర్ దివ్య, అడిషనల్ కలెక్టర్ శృతిజ్యోతి, సర్పంచ్, మండల రెవెన్యూ అధికారులకు పలు మార్లు విన్నవించామని, అయినా ఫలితం లేదని ప్రిన్సిపాల్ రాజేశ్వరి ఆరోపించారు. పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, విద్యార్థులను తీసుకెళ్తామంటున్నారని వెల్లడించారు. బాలికల భవితను దృష్టిలో పెట్టుకుని, పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

అనారోగ్యం పాలవుతున్నాం

పాఠశాల చుట్టూ ఉన్న సుద్ద పరిశ్రమల వలన తీవ్రమైన కాలుష్యం వెలువడుతోంది. ఫలితంగా మేమంతా ఇబ్బంది పడుతున్నాం. చదువుకోవటానికి కష్టంగా ఉంది. భోజనం చేయలేక పోతున్నాం. రాత్రి పూట నిద్ర పట్టడం లేదు. రోగాల బారిన పడుతున్నాం. మా గోడును విని, అధికారులు చర్యలు తీసుకోవాలి.

–శ్రీనిధి, ఇంటర్, ద్వితీయ సంవత్సరం

మూడేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నాం

కాలుష్యం కారణంగా బాలికలు ఇబ్బంది పడుతున్నారు. మూడేళ్లుగా ఇదే దుస్థితి. సంబంధిత ఉన్నతాధికారులతో పాటు మండల అధికారులు, నాయకులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నాం. అయినా ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కాలుష్యకారక పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకోవాలి.

– రాజేశ్వరి, ప్రిన్సిపాల్, మారేపల్లి గురుకుల పాఠశాల

ఫలితం లేని చెక్‌పోస్టు


కేరెళ్ల రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

ధారూరు: ధారూరు మండలం కేరెళ్లి రైతువేదిక సమీపాన తాండూర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుతో ఎలాంటి ఫలితం లేదని పలువురు అధికారులు, రాజకీయ నేతలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఈ చెక్‌పోస్టు చేరువకు రాకుండానే తాండూర్‌కు వెళ్లే మార్గాలు అనేకం ఉన్నాయని పేర్కొంటున్నారు. వికారాబాద్ నుంచి వచ్చే వాహనాలు అనంతగిరిగుట్ట మీదుగా కాకుండా.. బుగ్గ టెంపుల్ మీదుగా వస్తే మున్నూరుసోమారం, ధారూరు మీదుగా తాండూరుకు వెళ్లేందుకు వీలుందని, వికారాబాద్ నుంచి తాండూర్ వయా జైదుపల్లి, తరిగోపుల, అంపల్లి చౌరస్తా, రాస్నం మీదుగా సులభంగా వెళ్లవచ్చని వారు వివరించారు. కేరెళ్లికి వచ్చిన వాహనాలు ఎబ్బనూర్ చెరువు మీదుగా వయా ధారూరు నుంచి తాండూరు వెల్లవచ్చని చెప్పారు. అలాంటప్పుడు ఈ చెక్ పోస్టు ఏం ఉపయోగ పడుతుందని ప్రశ్నిస్తున్నారు. పోలీసులు ఆలోచించి అన్ని దారుల్లో వీటిని ఏర్పాటు చేయిస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి


మాట్లాడుతున్న కేపీఎస్‌పీఎస్ నాయకులు

కొడంగల్: మరికల్ మండలం చిత్తనూరు ఇథనాల్ కంపెనీని ఇక్కడి నుంచి తరలించాలని ఆందోళన చేసిన రైతులను జైల్లో పెట్టారని, వారిని విడుదల చేయడంతో పాటు, వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కేపీఎస్‌పీఎస్ జిల్లా కన్వీనర్ వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడారు. ఇథనాల్ కర్మాగారం వలన 54 గ్రామాలపై కాలుష్య ప్రభావం పడిందని, నాడు 6 మండలాలు, 150 గ్రామాలు 180కిలో మీటర్లు పాదయాత్ర చేసినా లాభం లేదన్నారు. అయితే ఇప్పుడు ఆ సంస్థ యాజమాని కేఎల్‌ఆర్ మహేశ్వరం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, వ్యాపార వేత్తలు రాజకీయ నాయకులుగా మారి ప్రజల హక్కులను కాలరాస్తున్నారని, అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, నరేష్, లక్ష్మప్ప, ఖాజామైనొద్దీన్ ఉన్నారు.

‘హస్తం’ వస్తే.. అభివృద్ధి ఆగమే

- గ్యారంటీల పేరుతో మభ్యపెడుతున్న కాంగ్రెస్
- బీఆర్‌ఎస్ వస్తేనే తెలంగాణకు మేలు
- ఇంటింటి ప్రచారంలో గులాబీ నేతలు


నవాబుపేట: అక్నాపూర్‌లో ప్రచారం చేస్తున్న గులాబీ శ్రేణులు

నవాబుపేట: కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధి దేవుడెరుగు, తెలంగాణ రాష్ట్రం ఆగం కావడం ఖాయమని ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ అన్నారు. మండల పరిధి అత్తాపూర్, అక్నాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలో ఉన్నన్నాళ్లు చేయలేని వారు, ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏం చేస్తారని ప్రశ్నించారు. గ్యారంటీ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, కాంగ్రెస్ గెలిస్తే స్కాములే తప్ప, ఎలాంటి స్కీములు అమలు కావని విమర్శించారు. మచ్చలేని ఎమ్మెల్యే యాదయ్యను గెలిపిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని, కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మండల నాయకులు నాగిరెడ్డి, మల్లారెడ్డి, ప్రభాకర్, ఆనంద్ రెడ్డి, అజయ్‌కుమార్, బుచ్చయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: తెలంగాణ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆశీర్వదించి, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని గులాబీ శ్రేణులు అభ్యర్థించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

స్వార్థం కోసమే పార్టీని వీడారు

యాలాల: స్వార్థం కోసమే కొందరు పార్టీని వీడారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, సొసైటీ వైస్ చైర్మన్ రాములు, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడాన్ని వారు తప్పుబట్టారు. పార్టీ మారిన వారు వెంటనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కారులో చేరికలు

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీలో ఇతర పార్టీల నుంచి భారీగా చేరుతున్నారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మండల పరిధి మొరంగపల్లి గ్రామానికి చెందిన సుమారు 50మంది కార్యకర్తలు వివిధ పార్టీల నుంచి సోమవారం మండల యువత తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో, పార్టీ అధ్యక్షుడు వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా.. వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మొరంగపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

పత్తి ఏరుడెట్లా?

- వేధిస్తున్న కూలీల కొరత
- ఎన్నికల ప్రచారంలో బిజీబిజీ
- కర్ణాటక నుంచి తీసుకురావడంతో పెరిగిన భారం



పెద్దేముల్: ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిన చందంగా.. ప్రస్తుత ఎన్నికలు కర్షకులకు తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా పత్తి రైతులకు. చేతికి వచ్చిన పంటను ఏరుదామంటే కూలీల కొరత ఏర్పడి, పంట చేలల్లోనే మగ్గిపోతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నేతలు, తమ పార్టీల తరఫున ప్రచారం చేయడానికి పల్లెలు, పట్టణాల ప్రజలను తరలిస్తుండగా.. పత్తి తీతకు రైతు కూలీలు దొరకడం లేదు. దీంతో తలలు పట్టుకోవడం అన్నదాతల వంతైంది. సకుటుంబ సమేతంగా నడుంకట్టినా పనులు ముందుకు సాగడం లేదని, తెల్ల బంగారాన్ని ఏరేదెట్లా అని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి..

‘పత్తి సాగుకు ఏటేటా పెట్టుబడి పెరిగిపోతోంది. విత్తనాలు, పిచికారి మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కానీ మద్దతు ధర ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా ఉంది’ అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు కూలీల కొరత వేధిస్తుండగా.. మరోవైపు కూలి రేట్లతో సహా పెరిగి పెట్టుబడి తడిసి ముద్దవుతోందని వాపోతున్నారు. గత ఏడాది మార్కెట్లో రూ.9వేల నుంచి రూ.9,500ల వరకు మద్దతు పలకడంతో పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపారు. కానీ ప్రస్తుతం రూ.7,100 ఉండటంతో కనీసం పెట్టుబడులు వస్తే చాలని నిరాశ చెందుతున్నారు.

తగ్గిన దిగుబడి

మండల పరిధిలో 80 శాతం రైతులు పత్తిని సాగు చేశారు. యేటా పంట అక్టోబర్, నవంబర్ మాసంలో చేతికి వచ్చేంది. ఈ సారి కూడా ఇందూరు, ఆత్కూర్, పెద్దేముల్, నాగులపల్లి, రుద్రారం, గోపాల్‌పూర్, మంబాపూర్, మారేపల్లి, తింసాన్‌పల్లి తదితర గ్రామాల్లో నవంబర్ మొదటి వారంలో పంట చేతికి రావడం, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి రావడం రైతులకు ఇబ్బందిగా మారింది. కూలీలు ఎన్నికల ప్రచారానికి మొగ్గు చూపుతుండటంతో కూలీలు లేక పత్తి చేలల్లోనే వాడిపోతోందని ఆవేదన చెందుతున్నారు. గతంలో కంటే ఈ యేడు దిగుబడి తగ్గిందని, ఎకరాకు 10 నుంచి 16 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని, ఇప్పుడు ఎకరాకు పది క్వింటాళ్లు దాటడం లేదని పలువురు చెప్పారు. వ్యయం పెరగడం, ఆదాయం సంగతి ఎలా ఉన్నా.. నష్టం వస్తోందని విలపిస్తున్నారు.

కర్నాటక కూలీలకు డిమాండ్

జిల్లాలోని పెద్దేముల్, కోటపల్లి, బంట్వారం, ధారూర్, బషీరాబాద్, తాండూరు మండలాల్లో రైతులు పత్తితో పాటు కంది పంటలను అధికంగా సాగుచేస్తారు. పంటలు ఒకే సారి చేతికి రావడంతో ఈ ప్రాంత రైతులు కర్ణాటక రాష్ట్రం కుంచారం, షాదీపూర్, జిలోజి తండాలకు చెందిన కూలీలకు అడ్వాన్స్‌గా డబ్బులు చెల్లించి, తీసుకురావడంతో వారూ కూలి రేట్లు అమాంతంగా పెంచేస్తున్నారని రైతులు చెప్పారు. గతంలో కిలో పత్తి ఏరితే రూ.8 ఇచ్చేవారమని, ఇప్పుడు రూ.10కి తగ్గడం లేదంటున్నారు. అంతే కాకుండా తీసిన దిగుబడిని ఇంటివద్దకు తీసుకు రాకుండా పొలాల వద్దే తూకం వేయడం, అక్కడి నుంచి ఇంటికి తీసుకు రావడానికి వేరే కూలీలను ఏర్పాటు చేసుకోవడం లాంటివి మరింత భారంగా మారిందని పేర్కొంటున్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పార్టీని వీడే ప్రసక్తే లేదు

యాలాల: బీజేపీ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడే ప్రసక్తే లేదని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు వెంకటేశం, శంకర్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జిల్లా ఉపాధ్యక్షుడు, మండల అధ్యక్షుడు, మరి కొందరు నాయకులు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారని, వారు వెళ్లినంత మాత్రాన పార్టీకి నష్టం ఏమీ లేదన్నారు. మండలంలో పార్టీ బలంగానే ఉందన్నారు. ఈ నెల 15వ తేదీ తరువాత పార్టీ ఆదేశం మేరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రామ్యనాయక్, బీజేవైఎం అధ్యక్షుడు అరుణ్‌కుమార్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి యాదగిరి తదితరులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు


కాలిపోయిన సామగ్రి

చేవెళ్ల: ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. రంగారెడ్డి చేవెళ్ల మండలంలోని పామెన గ్రామానికి చెందిన అనంతయ్య ఇంట్లో ఆదివారం విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు అరుస్తూ బయటకు పరుగులు తీశారు. ఇరుగుపొరుగు వచ్చి మంటలు ఆర్పారు. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలిపోవడంతో బాధిత కుటుంబీకులు బోరున విలపించారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి


శేరిగూడలో ప్రచారం చేస్తున్న కేఎస్ రత్నం తదితరులు


పార్టీలో చేరిన వారికి కాషాయ కండువాలు కప్పుతున్న నేతలు

షాబాద్: కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని బీజేపీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం అన్నారు. సోమవారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ, శేరిగూడ, ముద్దెంగూడ, కొమరబండ, బొబ్బిలి గామ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుంట్ల పాలన నుంచి తెలంగాణ రాష్ట్రానికి విముక్తి కల్పించాలని, సీఎం కేసీఆర్ మయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కేసీఆర్, కాలె యాదయ్య కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో పథకాలు అమలవుతున్నాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండాలను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్, సీనియర్ నాయకులు జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, క్యామ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, నాయకులు మాణెయ్య, మహేశ్, కూతురు మహేందర్, శ్రీశైలం తదితరులున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

కొందుర్గు: షాద్‌నగర్‌లో ఇప్పటివరకు అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారని, బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి కోరారు. ప్రచారంలో భాగంగా బీజేపీ నాయకులు సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని లచ్చంపేట, తుమ్మలపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి రహిత పాలనను తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందులో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య, నాయకులు సురేష్, రాజు, హరీశ్, సాయిరాం, లింగం, ప్రకాష్, వెంకటేష్ ఉన్నారు.

పథకాల పేరిట బీఆర్‌ఎస్ మోసం

- కార్యకర్తలకే అందుతున్న స్కీంలు
- అవినీతి పాలనను అంతమొందించాలి
- కాంగ్రెస్ వస్తే పక్కాగా ఆరు గ్యారంటీలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

దోమ/యాలాల: తెలంగాణలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేఖపాలనను ప్రజలు అంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అన్నారు. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు పేరిట ప్రజలను మభ్యపెట్టి, కేవలం అధికార పార్టీ కార్యకర్తలకే పథకాలను అందజేస్తున్నారని విమర్శించారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేసి, అర్హులందరికీ మేలు చేస్తామని చెప్పారు. కావున చేతి గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

పార్టీలో చేరికలు

యాలాల మండలం సంగాయగుట్టతండా, బామ్లా నాయక్‌తండాకు చెందిన పలువురు గిరిజన యువకులు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి తనయుడు శివకుమార్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు సునీల్, కిషన్ ఉన్నారు.


యాలాల: పార్టీలో చేరిన వారితో నాయకులు

నేడు ప్రచారం

ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి యాలాల మండలంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీసీసెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు కోకట్ గ్రామం నుంచి రాఘవపూర్, కమాల్‌పూర్, నాగసముందర్, అన్నసాగర్, బాణాపూర్, అడాల్‌పూర్, బాగాయిపల్లి, పగిడియాల, రాస్నం, గంగాసాగర్, సంగాయిపల్లితండా, అచ్యుతాపూర్, ముద్దాయిపేట, సంగాయగుట్టతండా, తొప్పెర్ల గడ్డతండాలో ప్రచారంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

భారీగా చేరికలు..

బషీరాబాద్: తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సొంత మండలం బషీరాబాద్ నుంచి అధికార పార్టీ నేతలు భారీగా వలసలు పోతున్నారు. రోహిత్ స్వగ్రామం ఇందర్‌చెడ్ నుంచి సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో హస్తం గూటికి పలువురు చేరారు.

కాంగ్రెస్‌ను ఆదరిస్తున్న ప్రజలు

మర్పల్లి: ప్రజా సమస్యలు పట్టించుకోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధంతో ఓడించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నిఖిల్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. మండల పరిధి వీర్లపల్లి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘుతో కలిసి నిఖిల్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదని ఆరోపించారు. దీంతో తెలంగాణ ప్రభుత్వంపై ప్రజలు విసుగు చెందారని, కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చేతి గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు శ్రీనివాస్, మైపాల్, రాజేశ్, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్ తదితరులు ఉన్నారు.


వీర్లపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు


జనం మధ్యన నిలిచిన ఆర్టీసీ బస్సు

భారీగా ట్రాఫిక్ జామ్

కుల్కచర్ల: మండల కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షో కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లి రావాల్సిన ఆర్టీసీ బస్సులు కుల్కచర్ల ప్రధాన చౌరస్తా మీదుగా వెళ్లాల్సి ఉంది. కానీ రోడ్ షో వలన వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. చౌరస్తా విస్తీర్ణం తక్కువగా ఉండటం, జనాలు ఎక్కువగా రావడంతో మంత్రి కేటీఆర్ వాహనం కూడలి వద్దకు రావడానికి చాలా సమయం పట్టింది.